మార్పు కోసం...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ / సంపుటి :5 సంచిక 254 14 గురువారం మార్చి, 2024 పేజీలు: 4/వెల



విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842


# బీజేపీ రెండో జాబితా విడుదల






జాబితాలో 72 మందికి చోటు - తెలంగాణ నుంచి మరో ఆరుగురికి స్థానం

ఆదిలాబాద్‌లో సిట్టింగ్ ఎంపి సోయం బాపూరావుకు చేయి

- మాజీ ఎంపి గోడం నగేశ్‌కు అవకాశం

మహబూబ్‌నగర్‌లో డికె అరుణ, మెదక్‌లో రఘునందన్

- మహబూబాబాద్‌లో సీతారాం నాయక్..నల్లగొండలో సైదిరెడ్డి

పెద్దపల్లి నుంచి గోమాస శ్రీనివాస్ - జితేందర్ రెడ్డిని పక్కన పెట్టిన బిజెపి అధిష్ఠానం


న్యూఢిల్లీ,మార్చి13(మరో ఉదయం):

మిగతా 3 లో




# అణు యుద్ధానికి రెడీగా ఉన్నాం

మాస్కో: మార్చి13(మరో ఉదయం)



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్) పశ్చిమ దేశాలకు వార్నింగ్ ఇచ్చాడు. సాంకేతికంగా తాము అణ్వాయుధ యుద్ధానికి రెడీగా ఉన్నామన్నారు. ఒకవేళ ఉక్రెయిన్‌కు అమెరికా తమ దళాలను పంపిస్తే, యుద్ధం మరింత జఠిలం అవుతుందని అన్నారు. అణ్వాయుధం వాడాల్సిన పరిస్థితి లేదు కానీ, మిలిటరీ కోణంలో ఆలోచిస్తే తాము రెడీ ఉన్నామని తెలిపారు. రోసియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఒకవేళ అమెరికా న్యూక్లియర్ టెస్టింగ్ చేపడితే, అప్పుడు తాము కూడా ఆ పరీక్ష చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధంలో మానవ హనన ఆయుధాలను ఇప్పటి వరకు వినియోగించలేదని పుతిన్ స్పష్టం చేశారు. అణ్వాయుధాలు ఉన్నాయని, కానీ వాటి వినియోగించేందుకు కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయన్నారు. రష్యా సార్వభౌమత్వానికి ఏదైనా ప్రమాదం వాటిల్లితే అప్పుడు వెపన్స్ వాడుతామని ఆయన తెలిపారు. తమ వ్యూహాల్లో అన్నీ ఉన్నాయని, వాటినేమీ మార్చలేదన్నారు.

## సమాజం ఛీత్కరించినా

# కెసిఆర్‌కు బుద్ధిరాలే

అబద్ధాలు, అభూత కల్పనలతో మభ్యపెట్టే యత్నం

కరీంనగర్ సభలో కెసిఆర్ పచ్చి అబద్ధాలు చెప్పారు

కేంద్రం నిధులిస్తే పక్కదారి పట్టించిన ఘనుడు

మండిపడ్డ బిజెపి ఎంపి బండి సంజయ్

కరీంనగర్,మార్చి13(మరో ఉదయం):



3 లో

## మరో రెండు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్



వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మరో రెండు లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్యను, చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్లను ప్రకటించారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో చర్చించి వారి అభిప్రాయాలకు అనుగుణంగా కేసీఆర్ అభ్యర్థులను ఎంపిక చేశారు.కాగా తొలి జాబితాలో బీఆర్ఎస్ పార్టీ నలుగురు అభ్యర్థులను ప్రకటించింది. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ, బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు, మహబూబాబాద్ (ఎస్టీ రిజర్వ్) స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత, కరీంనగర్ నుంచి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి (ఎస్సీ రిజర్వ్) స్థానం నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఇప్పటికే ఖరారుచేశారు.

# అత్యాశపరులు అంటే ఇష్టం ఉండదు

సోదరుడితో అన్ని బంధాలు

తెంచుకున్నాను... ఆయనకు

నచ్చినట్లు చేసుకోనివ్వండి

: మమతా బెనర్జీ

టీఎంసీ అభ్యర్థుల జాబితాపై

అసహనం వ్యక్తం చేసిన

మమత సోదరుడు బాబూల్

ఎన్నికల సమయంలో ఏదో ఒక

సమస్య సృష్టిస్తారని ఆరోపణ

ఆయన బీజేపీతో సంప్రదింపులు

జరుపుతున్నట్లుగా తెలిసిందని వ్యాఖ్య

మార్చి13(మరో ఉదయం)



తన సోదరుడు బాబూల్ బెనర్జీతో అన్ని బంధాలను తెంచుకున్నానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. టీఎంసీ అభ్యర్థుల జాబితాపై బాబూల్ అసహనం వ్యక్తం చేస్తూ మాట్లాడారు. దీంతో ఆయనపై అధినేత్రి మండిపడ్డారు. తన కుటుంబం, తాను అతడితో అన్ని బంధాలను తెంచుకున్నామని తెలిపారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో ఏదో ఒక సమస్యను సృష్టిస్తారని, అత్యాశపరులు అంటే తనకు ఇష్టం ఉండదన్నారు. తాను కుటుంబ రాజకీయాలను విశ్వసించనని స్పష్టం చేశారు.పార్టీ అభ్యర్థుల జాబితాపై బాబుల్ చేసిన వ్యాఖ్యలను తాను విన్నానని... ఆయన బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నట్లుగా తెలిసిందని పేర్కొన్నారు. ఆయనకు నచ్చినట్లు చేసుకోనివ్వండి... ఆయనతో మాకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. హౌరా లోక్ సభ స్థానాన్ని సిట్టింగ్ ఎంపీకి ఇవ్వడం పట్ల బాబుల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు, కేంద్రం తీసుకువచ్చిన సీఏఏపై కూడా మమతా బెనర్జీ స్పందించారు. తాము దీనిని వ్యతిరేకిస్తున్నామన్నారు. అసోం మాదిరి బెంగాల్లో శరణార్థి శిబిరాలను తాము కోరుకోవడం లేదన్నారు.

## కేంద్ర నిర్ణయానికి రాష్ట్రపతి ముర్ము

# ఆమోదముద్ర

కేంద్ర ఎన్నికల సంఘంలోకి ఇద్దరు కొత్త కమిషనర్లు

డాక్టర్ రాజేష్ కుమార్ గుప్తా, ప్రియాన్ష్ శర్మల నియామకం

న్యూఢిల్లీ,మార్చి13(మరో ఉదయం):



సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఖాళీగా ఉన్న స్థానాల్లో ఇద్దరు ఎన్నికల కమిషనర్లను ప్రభుత్వం నియమించింది. వీరి నియామకానికి సంబంధించి బుధవారం నాడు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ రాజేష్ కుమార్ గుప్తా (రిటైర్డ్ ఐఏఎస్), ప్రియాన్ష్ శర్మ (రిటైర్డ్ ఐఏఎస్) లను నూతన ఎన్నికల కమిషనర్లుగా నియమించింది.కేంద్ర ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల నియామక చట్టం 2023 ప్రకారం.. ఉన్నతస్థాయి కమిటీ ఇద్దరు కమిషనర్లను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీలో సభ్యులుగా భారత ప్రధాన మంత్రి, లోక్‌సభ విపక్ష నేత, కేంద్ర హోంమంత్రి సభ్యులుగా ఉంటారు. బుధవారం అంటే మార్చి 13వ తేదీ నుంచే ఈ కమిషనర్ల నియామకం అమల్లోకి వస్తుంది. వీరి నియామకానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్రవేశారు. కాగా, కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ సహా మరో ఇద్దరు కమిషనర్లు ఉంటారు. వీరిలో ఒక కమిషనర్ గతంలోనే రాజీనామా చేయగా.. ఇటీవల అరుణ్ గోయెల్ సైతం తన కమిషనర్ పదవికి రాజీనామా చేశారు. దాంతో ఎన్నికల సంఘంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ మాత్రమే ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్నికల సంఘం ఖాళీ అవడంతో.. కొత్తగా ఇద్దరు కమిషనర్లను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## దేశ ప్రాధాన్యాలు గుర్తించడంలో

# కాంగ్రెస్ విఫలం



సెమీ కండక్టర్ తయారీ పరిశ్రమ ఏర్పాటులో జాప్యం

రానున్న రోజుల్లో అగ్రగామిగా నిలవనున్న భారత్

సెమీకండక్టర్ ప్లాంట్‌లకు ప్రధాని మోడీ శంకుస్థాపన

న్యూఢిల్లీ,మార్చి13(మరో ఉదయం):

దేశ భవిష్యత్తు అవసరాలు, ప్రాధాన్యాలను గుర్తించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ప్రధాని మోదీ విమర్శించారు. అందువల్లే దేశంలో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమలు నెలకొల్పడంలో జాప్యం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. బుధవారం రూ. 1.25 లక్షల కోట్ల విలువైన సెమీకండక్టర్ ప్లాంట్‌లకు ప్రధాని మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇందులోభాగంగా గుజరాత్‌లో రెండు, అస్సాంలో ఒకటి ఏర్పాటు కానున్నాయి. తొలిసారిగా 1960లో సెమీ కండక్టర్ల తయారీ కోసం భారత్ కలలు కన్నది. అప్పటినుంచి దేశాన్ని పాలించిన ప్రభుత్వాలు వాటి ప్రాధాన్యాన్ని గుర్తించలేకపోయాయి. భవిష్యత్తు అవసరాలకు తగినట్లు పెట్టుబడులు పెట్టలేకపోవడంతో ఈ రంగంలో భారత్ చాలా వెనకబడింది. కానీ, మా ప్రభుత్వం అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా సెమీకండక్టర్ల తయారీకి సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు మాత్రమే వీటిని తయారుచేస్తున్నాయి. 21వ శతాబ్దం సాంకేతికత ఆధారంగా పనిచేస్తుంది. ఎలక్ట్రానిక్ చిప్ లేని గ్యా÷-జడెట్స్‌ను ఊహించడం కష్టం. మేడిన్ ఇన్ ఇండియా, డిజైన్ ఇన్ ఇండియా చిప్ ఎంతో దూరంలో లేదు. ఇతరులపై ఆధారపడకుండా భారత్ స్వయంసమృద్ధిగా ఎదగడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందని ప్రధాని తెలిపారు. భాజపా అధికారంలోకి వచ్చాక.. రక్షణ, బీమా, టెలికాం రంగంలో ఎఫ్‌డీఐలను ఆకర్షించేందుకు సరళతరమైన విధివిధానాలు రూపొందించినట్లు ప్రధాని తెలిపారు. ప్రస్తుతం మొబైల్ తయారీలో భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా నిలిచేందుకు ఇవి ఎంతో దోహదం చేశాయన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమల ద్వారా దేశ యువత అధికంగా లబ్ది పొందుతారని తెలిపారు. ఏఐ మిషన్‌లో భాగంగా సరికొత్త ఆవిష్కరణల కోసం భారత్ పనిచేస్తోందని, సాంకేతిక అభివృద్ధితోపాటు దాన్ని అమలుచేయడంపైనా కేంద్రం దృష్టి సారించిందన్నారు. 2029 కల్లా ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్లు తయారుచేస్తున్న తొలి ఐదు దేశాల్లో భారత్ ఉంటుందని కేంద్ర టెలికాం, ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. గుజరాత్‌లోని ధోలేలో జరిగిన సెమీకండక్టర్ ఎ÷-లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026 కల్లా తొలి దేశీయ చిప్ టాటా ఎలక్ట్రానిక్స్ ఎ÷-లాంట్ నుంచి ఉత్పత్తి అవుతుందని వెల్లడించారు. ఈ ప్లాంట్ ద్వారా 27 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు.

# కెసిఆర్ అత్యాశకు కాళేశ్వరం బలి

**అవినీతి అన్నారం,సుందిళ్లకు కూడా పాకింది**

**వెన్నముకలాంటి మేడిగడ్డ కుంగితే పన్నుతో పోలికా**

**సమస్యను చిన్నదిగా చేయడం దుర్మార్గం**

**కెసిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,మార్చి13(మరో ఉదయం):**

ఒక పన్ను పాడైతే మిగతా అన్ని పళ్లు పీకేసుకుంటామా? ఎన్నికల్లో ప్రజలు అత్యాశకు పోయారా? ముఖ్యమంత్రి భాషపై కరీంనగర్ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు తప్పు అని తెలంగాణ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం అన్నారు. కేసీఆర్ చెప్పినట్లుగా పాడైంది పన్ను అయితే బాగుండేదని పొంగులేటి శ్రీనివాస్ అన్నారు. కానీ కేసీఆర్ అవినీతికి బలైంది కాళేశ్వరానికి వెన్నెముకలాంటి మేడిగడ్డ అని అన్నారు. మనిషికి వెన్నెముక ఎంత ముఖ్యమో కాళేశ్వరం ప్రాజెక్టుకు మేడిగడ్డ కూడా అంతే ముఖ్యమని అన్నారు. వెన్నెముక విరిగిపోతే శరీరం ఎలా ఉంటుందో ఇప్పుడు కాళేశ్వరం పరిస్థితి కూడా అలాగే ఉందని పొంగులేటి అన్నారు. అపర మేధావి కేసీఆర్ సమస్యను చిన్నదిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎత్తిపోతల, తిప్పిపోతల అంటూ కాళేశ్వరం ప్రాజెక్ట్ వెన్నెముక అయిన మేడిగడ్డ బ్యారేజీ మొత్తం 22 పిల్లర్లలో దాదాపు 7 పిల్లర్లు 3 ఫీట్ల మేరకు కుంగిపోయాయని అన్నారు. ఈ విషయాన్ని ఎన్ఎస్డీఏ, కేంద్ర ప్రభుత్వ జల వనరుల నిపుణులు, మన ప్రభుత్వ నిపుణులు, రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారులు, మేధావులు, రైతు సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు, వివిధ పత్రికల ఎడిటర్లు, జర్నలిస్ట్ లు ఇలా ప్రజలు అందరూ ఏకరువు పెడుతున్నారని అన్నారు. ప్రజలు అత్యాశకు పోయారని ప్రజాతీర్పును కేసీఆర్ చులకన చేస్తున్నారని, తనకు ఓటు వేసినంత కాలం ప్రజలు మంచివారు, వ్యతిరేకంగా ఓటు వేస్తే మాత్రం ప్రజలకు తెలివి లేదు మూర్ఖులు అన్నట్లుగా కేసీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా తీర్పును ఆమోది స్తున్నామని ఈరోజు వరకు కేసీఆర్ నోటినుండి వెలువడిందా? ప్రజా తీర్పును ప్రశ్నించేలా కేసీఆర్ మాట్లాడడం ఎంత వరకు సమంజసం అన్నారు.కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోను కాపీ చేసి 400కు సిలిండర్ ఇస్తానంటే కూడా కేసీఆర్ హామీలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. మేడిగడ్డ తర్వాత అన్నారం సుందిళ్ల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని పొంగులేటి అన్నారు. కేసీఆర్ అవినీతి జబ్బు ఒక మేడిగడ్డకే పరిమితం కాలేదని.. అన్నారం సుందిళ్ళకు కూడా పాకిందని అన్నారు. తానే ఇంజనీర్, తానే డిజైనర్, తానే తాపీ మేస్త్రి అనే విధంగా వ్యవహరించారని కాళేశ్వరం కెసిఆర్ అవినీతి అహంకారానికి మూర్ఖత్వానికి నిదర్శనం అని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ తర్వాత అన్నారం బ్యారేజీ, సుందిళ్ల ప్రాజెక్టుల పరిస్థితి కూడా చాలా ఆందోళనకరంగా ఉంది. కేసీఆర్ అవినీతి జబ్బు ఒక మేడిగడ్డకే పరిమితం కాలేదు. ఆ జబ్బు అన్నారం సుందిళ్ళకు కూడా పాకింది. తానే ఇంజనీర్, తానే డిజైనర్, తానే తాపీ మేస్త్రి అనే విధంగా వ్యవహరించారు. కాళేశ్వరం కేసీఆర్ అవినీతి అహంకారానికి మూర్ఖత్వానికి నిదర్శనం' అని పొంగులేటి విమర్శించారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలు పాల్గొనకుండా పారిపోయిన పెద్దమనిషి 80వేల పుస్తకాలు చదివిన మేధావి కాళేశ్వరం రూపశిల్పి ఇప్పుడు టీవీల ముందుకు వచ్చి మాట్లాడుతారంట అని ఎద్దేవా చేశారు. భూమి ఆకాశం ఉన్నన్నిరోజులు బీఆర్ఎస్ ఉంటుందన్న కేసీఆర్ వ్యాఖ్యలపై స్పందించారు. టీఆర్ఎస్ స్థానంలో కెసిఆర్ ఏర్పాటు చేసిన భారత రాష్ట్ర సమితి పరిస్థితి ఏమైందో అందరికీ తెలుసని, దేశంలో గత్తెర లేప్త భూకంపం సృష్టిస్తా అని చెప్పిన వ్యక్తి దేశంలో ఏ ఒక్క రాష్ట్రంలో పోటీ చేయలేక చేతులెత్తేయగా, ఉన్న రాష్ట్రంలో ప్రజలు కెసిఆర్ కుర్చీ మడత పెట్టారని, రాబోయే రోజుల్లో ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా బీఆర్ఎస్ కు అభ్యర్థులు దొరకలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. కేసిఆర్ పాలనలో జరిగిన పాలనపరమైన తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. కరువుకు కాంగ్రెస్ పార్టీకి ఏమైనా సంబంధం ఉందా ? మా ప్రభుత్వం డిసెంబర్ 7వ తేదీన ఏర్పడిందని, అప్పటికే



# రజక సోదరుల అభ్యున్నతికి కృషిచేస్తా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**మరో ఉదయం ప్రతినిధి మార్చి 13 (కుత్బుల్లాపూర్):**

ఈరోజు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ రజక సంఘం నాయకులు సింగారం మల్లేష్ అధ్వర్యంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద గారిని కలిసి రజక సోదరుల సౌకర్యార్థం మోడర్న్ దోభి ఘాట్,రజక భవన్ ను నిర్మించాలని వినతి పత్రం అందజేశారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కులవృత్తుల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అత్మ గౌరవ భవనాలు నిర్మించుకున్నామని, రానున్న రోజుల్లో కూడా రజక సోదరుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు శంకర్,సాయిబాబా, సత్యనారాయణ,వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు...



# నిత్యం ప్రజల్లో ఉండే నేత, కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్...

**మరో ఉదయం ప్రతినిధి మార్చి 13 (కుత్బుల్లాపూర్):**

ఈరోజు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే గారి నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, ప్రజలు కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని కలిసి శుభకార్యాలకు ఆహ్వానించగా,మరికొందరు అభివృద్ధి పనులపై వినతి పత్రాలు అందజేశారు.దీనిపై ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ సానుకూలంగా స్పందించి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసుకొని నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానన్నారు...



# ఆర్య వైశ్యుల నూతన కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం...

**రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఆర్యవైశ్య సంఘం మహాసభ నేతలు...**

**మరో ఉదయం ప్రతినిధి మార్చి 13 (కుత్బుల్లాపూర్):**

ఆర్య వైశ్యుల కోసం నూతన కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలపడంతో బుదవారం జగద్గిరిగుట్ట బస్ స్టాప్ సమీపంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆర్యవైశ్య సంఘం మహాసభ నేతలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్వీట్లు పంచి టపాకాయలు కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎన్నడూ తమ ఆర్యవైశ్యుల గురించి ఎప్పుడు ఆలోచించలేదని తమ ఆర్యవైశ్యులలో కూడా పేద ప్రజలు ఉన్నారని ఈ కార్పొరేషన్ ఏర్పాటు తో పేదవారికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఇలాంటి నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయాలని వారు కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం మహాసభ వైస్ ప్రెసిడెంట్ తేరాల శ్రీనివాస్ గుప్తా, వాసవి కన్యక పరమేశ్వరి ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు రేగూరి ప్రవీణ్ గుప్తా, ప్రెసిడెంట్ ఉప్పల రమేష్ గుప్తా, వైస్ ప్రెసిడెంట్ నేతి శంకర్ గుప్తా,ఆర్యవైశ్య సంఘం రామచందర్ గుప్తా,మెతుకు సత్తయ్య గుప్తా,గోలి రాజయ్య గుప్తా,గోలి శంకర్ లింగం గుప్తా, యూత్ అధ్యక్షులు పబ్బ నరేష్ గుప్తా,కోశాధికారి లింగ వేణు గుప్తా,కృష్ణమూర్తి గుప్తా,శివ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

**కొలుకుల శశికళ జగన్.**

**మరో ఉదయం ప్రతినిధి మార్చి 13 (కుత్బుల్లాపూర్):**

మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే సమాజాభివృద్ధి చెందుతుందని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ సతీమణి కొలుకుల శశికళ అన్నారు.ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని డివిజన్ పరిధి ఎంకేఆర్ ఫంక్షన్ హాల్ లో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి ఆమెతోపాటు జగద్గిరిగుట్ట తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వి.రఘు నందన్ రావు లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.పురుషులతో సమానంగా నేడు మహిళలు స్వశక్తితో ఎదుగుతున్నారని. విద్య ఉపాధి రంగాలలో మహిళలదే అగ్రస్థానం ఉందని ఆమె తెలిపారు.బిఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎంతో కృషి చేసిన అని గుర్తు చేశారు.బ్యాంకు మేనేజర్ వి.రఘునందన్ రావు మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలరని తెలిపారు.సమైక్య గ్రూపుల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలని అన్నారు. వివిధ రకాల ఆటపాటలతో మహిళలు యువతులు సందడి చేశారు.అనంతరం ప్రతిభ కనబరిచిన మహిళలకు యువతులకు బహుమతులను వారు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో పి.ఓ.కిషోర్,ఆర్.పి.లు,సమైక్య సంఘాలు అధ్యక్షులు, సభ్యులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# పల్లె దవఖాన అభివృద్ధికి సహకరించండి

**తెలంగాణ పౌర స్పందన వేదిక ప్రతినిధుల బృందం.**

**జిల్లా వైద్యశాఖ అధికారికి వినతి.**

**మరో ఉదయం ప్రతినిధి మార్చి 13 (కుత్బుల్లాపూర్):**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్ ప్రాంతంలో "పల్లె దవాఖానకు సుస్తి" అనే శీర్షికన జనవరి 18 న రాసిన కథనానికి తెలంగాణ పౌర స్పందన వేదిక ప్రతినిధుల బృందం స్పందించారు. మరుసటి రోజు సదరు పల్లె దవాఖాన ను వారు సందర్శించి దవాఖాన సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాధేశ్యామ్ తెలిపారు.ఈ మేరకు బుధవారం తెలంగాణ పౌర స్పందన వేదిక మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ టి రఘునాథ స్వామి తోపాటు జిల్లా కలెక్టర్ పేషీ లోని కార్యాలయ కార్యదర్శిలకు కూకట్పల్లి,బాచుపల్లి, బాలనగర్,మండలాల పరిధిలోని పాఠశాలల సమస్యలపై అధికారులకు వేరువేరుగా వినతిపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా స్పందించిన జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ స్వామి మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో పల్లె దవాఖానాల కోసం పక్కా స్థలాలను సేకరించి తమకు నివేదికను అందజేస్తే తక్షణమే నిధులు మంజూరు చేయిస్తామని తెలంగాణ పౌర స్పందన వేదిక సభ్యులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు టి సురేష్ కుమార్ జిల్లా కోశాధికారి ఆర్ సుధాకర్ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.



# సమాజం ఛీత్కరించినా కెసిఆర్‌కు బుద్దిరాలే

మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ ను తెలంగాణ సమాజం ఛీత్కరించిన బుద్ధిరాలేదని బీజేపీ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. పచ్చి అబద్దాలు, అభూతకల్పనలతో మళ్లీ ప్రజలను నమ్మించే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్ కదనభేరి సభలోకేసీఆర్ మాట్లాడిన వ్యాఖ్యలకు సంజయ్ కౌంటర్ ఇచ్చారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. కేంద్రం నిధులు ఇచ్చినా బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మ్యాచింగ్ గ్రాంట్ ఎందుకు ఇవ్వలేదని బిజెపి ఎంపి బండి సంజయ్ ప్రశ్నించారు. కేంద్రం నిధులను కెసిఆర్ ఇతర కార్యక్రమాలకు మళ్లించారని, నిధుల మళ్లింపుపై గతంలో కేంద్రం లేఖలు రాసిందని, కేంద్రం రాసిన లేఖలకు అప్పటి ప్రభుత్వం ఎందుకు బదులివ్వలేదని బండి సంజయ్ నిలదీశారు. కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ హోదా ఇచ్చిందని బిజెపి అని తెలియజేశారు. కేంద్రం మూడు సార్లు లేఖలు రాసినా కెసిఆర్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని అడిగారు. కేంద్రం స్మార్ట్ సిటీ ఇస్తే తామే తెచ్చామని కెసిఆర్ అబద్దాలు చెబుతున్నారని బండి సంజయ్ దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులే కరువయ్యారని... ఆ పార్టీలోని నేతలంతా ఇతర పార్టీలవైపు చూస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ నిజాయితీపరుడైతే రూ.500 కోట్ల విలువైన భూదాన్ భూముల స్వాధీనంపై నోరెందుకు మెదపలేదని కేసీఆర్‌ను సంజయ్ ప్రశ్నించారు. కేసీఆరే పెద్ద అవినీతిపరుడంటూ సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాత అంశాలను తోడి సెంటిమెంట్ ను రెచ్చగొట్టేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ÷రైయ్యారు. భద్రాచలంలోని 7 మండలాలను ఏపీలో విలీనానికి ఒకే చెప్పిందే కేసీఆర్ అంటూ సంజయ్ ఆరోపించారు. అప్టాల్ 7 మండలాలు పోతే పోనీ... తెలంగాణ వస్తుంది కదా అన్నదే కేసీఆర్ అని అన్నారు. కరీంనగర్ కు స్మార్ట్ సిటీ నిధులు కేసీఆర్ ఇచ్చిండా?... కేంద్రం కదా మంజూరు చేసిందా అని సంజయ్ ప్రశ్నించారు. కేంద్రం స్మార్ట్ సిటీ కింద కేంద్రం రూ.196 కోట్లు మంజూరు చేస్తే రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్ కింద అదనంగా రూ.196 కోట్లు ఆనాడు ఎందుకు విడుదల చేయలేదని నిలదీశారు. స్మార్ట్ సిటీ నిధులను కేసీఆర్ ప్రభుత్వం దారి మళ్లిస్తే తాను కేంద్రానికి ఫిర్యాదు చేశానని చెప్పారు.లక్ష ఓట్లతో లక్షణంగా ఓడిపోయిన చరిత్ర వినోద్ కుమార్ ది అని విమర్శించారు బండి సంజయ్. కేసీఆర్ ముఖాన్ని జనం ఛీత్కరించారు.. వినోద్ ముఖానికి ఓట్లు పడే పరిస్థితి లేదన్నారు. పార్లమెంట్ లో 106 సార్లు మాట్లాడి వినోద్ కుమార్ సాధించేదేమిటని ప్రశ్నించారు. కరీంనగర్ -వరంగల్, కరీంనగర్-జగిత్యాల, ఎల్కతుర్తి-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణకు నిధులెందుకు తీసుకురాలేదన్నారు. ఆ రోడ్ల విస్తరణ కోసం కేంద్రాన్ని ఒప్పించి దాదాపు రూ.5 వేల కోట్ల నిధులను తాను తీసుకొచ్చినని బండి తెలిపారు.

# బీజేపీ రెండో జాబితా విడుదల

బీజేపీ రెండో జాబితా విడుదలైంది. 72 మందితో కూడిన సెకండ్ లిస్టును ప్రకటించగా తెలంగాణ నుంచి ఆరుగురికి చోటు లభించింది. మెదక్ నుంచి రఘునందన్ రావు, నల్గొండ నుంచి సైదిరెడ్డి, పెద్దపల్లి నుంచి గోమాస శ్రీనివాస్, ఆదిలాబాద్ నుంచి గోడం నగేశ్, మహబూబాబాద్ సీతారం నాయక్, మహబూబ్ నగర్ నుంచి డీకే ఆరుణ పేర్లను బీజేపీ ప్రకటించింది. ఇప్పటికే ఫస్ట్ లిస్టులో 9 సీట్లకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ తాజా జాబితాతో తెలంగాణలో మొత్తం 15 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వరంగల్, ఖమ్మం స్థానాలను పెండింగ్ లో పెట్టింది. వరంగల్ నుంచి ఆరూరి రమేష్ పేరు ఖరారు అయినప్పటికీ చివరి నిమిషంలో ఆయన కేసీఆర్ తో భేటీ అయ్యారు. ఇక ఖమ్మం నుంచి జలగం వెంకట్రావ్ పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు, మహబూబ్ నగర్ సీటు ఆశించిన జితేందర్ రెడ్డిలకు అధిష్టానం బిగ్ షాకిచ్చింది. మొత్తం 10 రాష్ట్రాలతో పాటు దాద్రా నగర్ హవేలికి సంబంధించిన అభ్యర్థులనూ బీజేపీ ప్రకటించింది. ఢిల్లీ(2), గుజరాత్(7), హరియాణా(6), హిమాచల్ ప్రదేశ్(2), కర్ణాటక(20), మధ్యప్రదేశ్(5), మహారాష్ట్ర(20), త్రిపుర(1), ఉత్తరాఖండ్(2), దాద్రా నగర్ హవేలి(1) స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. బీజేపీ ఇప్పటికే ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాని విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం 195 మంది అభ్యర్థులతో కూడిన ఆ తొలి జాబితాలో తెలంగాణ నుంచి మొత్తం 9 మంది చోటు సంపాదించారు. ఇప్పుడు తాజాగా ఆ పార్టీ 72 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాని విడుదల చేసింది. ఇందులో ఆరుగురు తెలంగాణ అభ్యర్థులు స్థానం దక్కించుకున్నారు. ఆదిలాబాద్‌లో సిట్టింగ్ ఎంపిని కాదని బిఆర్ఎస్ నుంచి వచ్చి చేరిన మాజీ ఎంపి గోడం నగేశ్‌కు స్థానం కల్పించారు. అలాగే మహబూబాబాద్‌లో కూడా మాజీ ఎంపి సీతారాం నాయక్ ఇటీవలే బిజెపిలో చేరగా ఆయనకు కూడా టిక్కెట్ కేటాయించారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే శానం సైదిరెడ్డికి టిక్కెట్ ఇవ్వడం గమనార్హం. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన వారికే టిక్కెట్లు కేటాయించారు. అందరూ ఊహించినట్లుగానే మెదక్ ఎంపి సీటును రఘునందన్ రావుకు కేటాయించారు. ఇప్పటికే మల్కాజిగిరి స్థానాన్ని ఈటెల రాజేందర్‌కు కేటాయించారు.

# సిఎఎ అత్యంత ప్రమాదకరం

**దేశానికి అనర్థమన్న కేజ్రీవాల్**

**న్యూఢిల్లీ,మార్చి13(మరో ఉదయం):**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సిఎఎ చట్టాన్ని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యతిరేకించారు.. బుధవారం ఇండియా కూటమి నేతలో కలిసి నిరసన వ్యక్తం చేశారు. సిఎఎ చాలా ప్రమాదకరమైనదని..శాంతిభద్రతలు దెబ్బతింటాయని..దొంగతనాలు, దోపిడీలు,అత్యాచారాలు పెరుగుతాయని అన్నారు. పాకిస్థాన్,బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి మైనార్టీలకు పౌరసత్వం ఇవ్వబడుతుందని వ్రాయబడిందన్నారు. ఇండియా పేద దేశం.. స్వాతంత్ర్యానంతరం కంటే సీఏఏ చట్టం వల్ల వలసలు ఎక్కువ కానున్నాయన్నారు. మరోవైపు ఆప్ ప్రభుత్వ హయాంలో ఢిల్లీలో జరిగిన అభివృద్ధి, మౌళిక వసతుల కల్పన గురించి సీఎం కేజ్రీవాల్ మాట్లాడారు. గత తొమ్మిదేళ్లలో ఢిల్లీలో నీటి పైపులైన్లు గతంలో ఎన్నడూ వేయలేదన్నారు. ఆప్ ప్రభుత్వం వచ్చేనాటికి ఢిల్లీలో 4500 బస్సులు ఉండేవని.. ఇప్పుడు 8వేల బస్సులున్నాయన్నారు. అందరికోసం పనిచేస్తున్నాం. ఆస్పత్రులు మెరుగుపర్చామన్నారు కేజ్రీవాల్. ఢిల్లీలోని ప్రతి గల్లీలో మొహల్లా క్లినిక్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పుడు ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు సీఎం కేజ్రీవాల్.

# సినిమా వార్తలు

## రామాయణంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్

నితేశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ ప్రొడ్యూసర్లతో కలిసి అల్లు అరవింద్ ప్రతిష్ఠాత్మకంగా రామాయణాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో రాముడిగా స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. తాజాగా ఈ విషయంపై 'రామాయణ్' సీరియల్‌లో రాముడిగా నటించిన అరుణ్ గోవిల్ మాట్లాడారు. 'రణ్‌బీర్ గొప్ప నటుడు. తన యాక్టింగ్‌కు ఎన్నో అవార్డులు వచ్చాయి. చాలా కష్టపడి పనిచేస్తాడు. సంస్కారవంతుడు. నైతిక విలువలు కలిగిన వ్యక్తి. భారతీయ సంస్కృతిని గౌరవిస్తాడు. తన పాత్రకు వందశాతం న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాడు. రాముడిగా కూడా ఉత్తమంగా నటిస్తాడని నా అభిప్రాయం' అని చెప్పారు. ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఏప్రిల్‌లో వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. శ్రీరామ నవమి సందర్భంగా సినిమాపై అప్‌డేట్ ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు ఎన్నో రోజులుగా ప్రచారం జరుగుతోంది. దీని వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్‌ల కోసం నితేశ్ తివారీ టీమ్ ఆస్కార్ విన్నింగ్ కంపెనీ డీఎన్ఈజీతో సంప్రదింపులు జరిపిందట. ఈ చిత్రం కోసం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని వినియోగించాలని చిత్రబృందం యోచిస్తోందని అందుకే లుక్ టెస్ట్ కోసం కూడా త్రీడీ టెక్నాలజీని ఉపయోగించారని ప్రచారం సాగుతోంది.





## పెళ్లి పీటలెక్కిన నటి మీరా చోప్రా

బాలీవుడ్ నటి మీరా చోప్రా వివాహబంధంలోకి అడుగుపెట్టింది. ముంబైకి చెందిన రక్షిత్ అనే ప్రముఖ వ్యాపారవేత్తతో మీరా మంగళవారం ఏడడుగులు వేసింది. రాజస్థాన్‌లోని ఓ రిసార్ట్‌లో వీరి పెళ్లి జరుగగా మీరా చోప్రా తన వివాహ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. ఇక ఇరు కుటుంబాల సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఈ పెళ్లి వేడుక గ్రాండ్‌గా జరిగింది. ప్రియాంక చోప్రా, పరిణితి చోప్రా.. మీరాకు కజిన్లు. చోప్రా కుటుంబ సభ్యులు కూడా ఈ వివాహానికి హాజరయ్యారు. అయితే ఈ పెళ్లికి ప్రియాంక చోప్రా రాలేదు. పవన్ కళ్యాణ్ 'బంగారం' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది మీరా చోప్రా. ఆ తర్వాత 'వానస, మారో', 'గ్రీకు వీరుడు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ఇక చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న మీరా ప్రస్తుతం సఫేద్ అనే సినిమాలో నటిస్తుంది. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ప్రేమలు సినిమా చూసి ఆనందించా: మహేశ్ బాబు

రీసెంట్‌గా విడుదలై.. బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోన్న చిన్న సినిమా 'ప్రేమలు' పై సోషల్ మీడియా వేదికగా సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రశంసల వర్షం కురిపించారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమా చూస్తూ హాయిగా నవ్వుకున్నట్లుగా ఆయన చెప్పుకొచ్చారు. ఫిబ్రవరి 9న విడుదలైన మలయాళ చిత్రం 'ప్రేమలు' అక్కడ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ఈ మూవీకి మంచి ప్రశంసలు దక్కాయి. మంచి కామెడీ, లవ్ అనే అంశాలతో 'ప్రేమలు' సినిమా స్టోరీ లైన్, దాన్ని తెరకెక్కించిన విధానాన్ని ప్రేక్షకులు అద్భుతమని మెచ్చుకున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు పాన్ ఇండియా డైరెక్టర్ ఎస్.ఎస్.రాజమౌళి తనయుడు ఎస్.ఎస్.కార్తికేయ అందించారు. మార్చి 8న విడుదలైన ఈ మూవీ తెలుగు వెర్షన్‌కు.. విడుదలైనప్పటి నుండి చాలా మంచి స్పందన వస్తోంది. సినిమా చూసిన ప్రముఖులెందరో ఈ సినిమాను కొనియాడుతున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని చూసిన సూపర్ స్టార్ మహేష్ బాబు.. సోషల్ మీడియా వేదికగా సినిమాను, సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించిన కార్తికేయ ను అభినందించారు. తెలుగు ప్రేక్షకులకు 'ప్రేమలు' చిత్రాన్ని అందించిన కార్తికేయకు ధన్యవాదాలు. బాగా ఎంజాయ్ చేశాను. చివరిగా నేను ఏ సినిమా చూసి ఇలా ఎంజాయ్ చేశానో గుర్తు లేదు. ఫ్యామిలీ మొత్తానికి ఈ సినిమా బాగా నచ్చింది. సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ అద్భుతమైన నటనను కనబరిచారు. టీమ్ మొత్తానికి నా అభినందనలు అని సూపర్ స్టార్ మహేష్ బాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు లైక్స్, కామెంట్స్‌కి అయితే లెక్కే లేదు. ఒక మంచి సినిమాను ప్రమోట్ చేయడానికి, ఒక మంచి సినిమాను ప్రేక్షకులకు చేరవేయడానికి మహేష్ బాబు ఎప్పుడూ ముందుంటారని మరోసారి నిరూపించారంటూ.. అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.



## లాల్ సలాం ఫెయిల్యూర్‌కు అదే కారణమా

### 21 రోజుల షూట్ మిస్సయ్యిందన్న ఐశ్వర్య

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'లాల్ సలాం' ఆయన కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్ దీనికి దర్శకత్వం వహించారు. భారీ అంచనాలతో విడుదలైన ఈ చిత్రం అనుకున్న స్థాయిలో విజయాన్ని సాధించలేదు. తాజాగా దీనిపై ఐశ్వర్య ఓ షాకింగ్ విషయాన్ని వెల్లడించారు. 21 రోజుల షూటింగ్ ఫుటేజ్ పోయిందని దాని ప్రభావం సినిమా ఫలితంపై పడిందన్నారు. 'సినిమాలోని ప్రధాన భాగానికి సంబంధించిన షూటింగ్ ఫుటేజ్ మిస్సయింది. దాదాపు 21 రోజుల ఫుటేజ్ అది. పూర్తి బాధ్యతారాహిత్యం కారణంగానే ఇలా జరిగింది. క్రికెట్‌కు సంబంధించిన సన్నివేశాలను 20 కెమెరాలతో నిజమైన మ్యాచ్‌లా షూట్ చేశాం. మా దురదృష్టం కొద్ది పోగొట్టుకున్నాం. మాకు ఏం చేయాలో అర్థంకాలేదు. అప్పటికే విష్ణు, నాన్న(రజనీకాంత్)తో సహా అందరూ గెటప్‌లు మార్చుకున్నారు. అందుకే రీ షూట్ చేయలేకపోయాం. చివరికి మిగిలి ఉన్న దానితో సినిమాను ఎడిట్ చేశాం' అని చెప్పారు. ఇక ఈ 'లాల్ సలాం'పై వచ్చిన విమర్శల గురించి మాట్లాడుతూ.. 'వ్యక్తిగతంగా సినిమా విషయంలో సంతృప్తి చెందాను. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించాం. అందుకే మలుపులు ఎక్కువ లేవు. కథంతా సూటిగా, సింపుల్‌గా ఉంటుంది. నేను విమర్శలను, ప్రశంసలను సమానంగా తీసుకుంటాను. నన్ను నేను మెరుగుపరుచుకోవడానికి ఈ చిత్రం సాయపడింది' అన్నారు. ఇటీవల కూడా ఐశ్వర్య ఈ సినిమా ఫెయిల్యూర్‌పై మాట్లాడుతూ.. రజనీకాంత్ పాత్ర కోసం మొదటరాసుకున్న స్క్రిప్ట్‌లో మార్పులు చేశామన్నారు. ఆయన కోసం సినిమాకు వచ్చేవారు నిరాశకు గురికాకూడదని ఆ పాత్రలో మార్పులు చేసి మొదటి నుంచి ఉండేలా స్క్రిప్ట్ ఎడిట్ చేసినట్లు తెలిపారు. దాని వల్ల ప్రేక్షకులు గందరగోళానికి గురైనట్లు చెప్పారు.



Edited,printed,published and Owned by sredharPrinted at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com